ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న రమాకాంత్‌గుప్తా

చంపాపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల రమాకాంత్‌గుప్తా మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమాకాంత్‌గుప్తా మాట్లాడు తూ 10సంవత్సరాలుగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్న ఆర్యవైశ్యులకు సీఎం రేంవత్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉప్పల శ్రవణ్‌కుమార్‌గుప్తా, ఆరాధన ఫౌండేషన్ చైర్మన్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 20(ఆంధ్ర జ్యోతి): హనుమాన్ శోభాయాత్రను రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎమ్మె ల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హనుమాన్ జయంతి శోభాయాత్ర నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులచే తన కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హనుమాన్ జయంతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. శోభాయాత్రకు వచ్చే భక్తులకు మంచినీరు, ప్రసాదం అందజేయడం జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా శోభాయాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి : వీహెచ్‌పీ

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వీర హనుమాన్ విజయ యాత్ర ఈనెల 23వ తేదీ మంగళవారం ఉదయం 7.30గంటలకు కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బైక్ ర్యాలీ ప్రారంభం కానుందని వీహెచ్‌పీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావినూతల శశిధర్ తెలిపారు. శనివారం జరిగిన సమావేశం అనంతరం ఆయన ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. పరం పూజ్య స్వామిజీలు, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి బైక్ ర్యాలీ ప్రారంభిస్తారని ఆయన వివరించారు. హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే ఈ వీర హనుమాన్ విజయయాత్ర సంతోష్‌నగర్, సైదాబాద్, సరూర్‌నగర్, కొత్తపేట, చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, చాదర్‌ఘాట్ మీదుగా కోఠిలో జరగనున్న మెయిన్ ర్యాలీలో కలవనుందన్నారు. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని తాడ్బన్ హనుమాన్ ఆలయం వరకు విజయయాత్ర సాగనుందన్నారు. యువత బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు మహేష్, బ్రహ్మచారి, నవీన్‌కుమార్, నిఖిల్‌సింగ్, రాంరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

పేదింటి వధువులకు పుస్తె, మెట్టెలు అందజేత

వనస్థలిపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా శనివారం నాగోల్‌లోని తన నివాసంలో నలుగురు పేదింటి వధువులకు పుస్తె, మెట్టెలు ఉచితంగా అందజేశారు. త్వరలో పెళ్లి చేసుకోబోతున్న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలైన ప్రశాంతి, కె.నందిని, పి.నందిని, యాదగిరిగుట్టకు చెందిన వేముల భావనకు పుస్తె, మెట్టెలు, చీర, గాజులు అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, మేడిపల్లి కాంగ్రెస్ నాయకులు రాములు, పెళ్లి కూతుర్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




సమావేశంలో జడ్పీటీసీ దేవదాసుగౌడ్ తదితరులు

మండల సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల సర్వసభ్య సమావేశం శనివారం హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పలు ఎజెండా అంశాలపై సమావేశంలో చర్చించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు అధికారులకు సూచించారు. చెరువు, కుంటలు ఆక్రమణకు గురౌతున్నాయని ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని తారామతిపేట ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ మురుగు నీటిని గ్రామంలోని నాలాలో కలుపడంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీటీసీలు భాస్కర్‌గౌడ్, వెంకటేశ్, బాలలింగస్వామి, అనితామహేందర్, లావణ్యయాదగిరి, కో-ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, ఎంపీవో వినోద, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఓటరు అవగాహన కార్యక్రమం



ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఏఆర్‌వో రాజేశ్‌కుమార్, నోడల్ అధికారి యుగెంధర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ముంతాజ్ కళాశాలలో శనివారం ఓటరు అవగాహన కార్యక్రమాన్ని మలక్‌పేట ఏఆర్‌వో రాజేశ్‌కుమార్ నిర్వహించారు. పొదుపు మహిళా సంఘాల ప్రతినిధులు, ఆర్‌పీలతో కలిసి నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఏఆర్‌వో జయశ్రీ, నోడల్ ఆఫీసర్ జి.యుగెంధర్‌రెడ్డి కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు. ఓటరు నైన నేను తప్పకుండా ఓటు వేస్తానంటూ ఓటర్లు ఎవరికి వారుగా ప్రమాణం చేయాలని, పోలింగ్ రోజున తమ బాధ్యతగా ఓటర్లు ఓటు వేసేందుకు ఉదయాన్నే పోలింగ్ బూత్‌లకు వెళ్లాలంటూ ఏఆర్‌వో సూచించారు. ఓటు హక్కును అర్హులైన ఓటర్లందరు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సభ



మాట్లాడుతున్న గోవర్ధన్‌యాదవ్

చంపాపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ కేంద్ర ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు వాణీ కన్యాకుమారి ఉద్యోగ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్య గారి గోవర్ధన్‌యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అన్నారు. ఉపాధ్యాయులు వాణీ కన్యాకుమారీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం వెంకటనర్సింహారెడ్డి, పీఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్, రాష్ట్రశాఖ బాధ్యులు చంద్ర, రాఘవేందర్, విజయసేనారెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహులు, సునీత పాల్గొన్నారు.

కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

ఎల్బీనగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది.. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వీఎం హోం గ్రౌండ్స్‌లో శనివారం మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ప్రచారం నిర్వహించారు. అంతకుముందు వీఎంహోం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆధ్వర్యంలో వాకర్స్ ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను బడా పారిశ్రామిక వేత్తలకు దాసోహం చేస్తుందన్నారు. దేశంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలతో పాటు సబ్బండ వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎంపీగా పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌గౌడ్, ఎస్వీ కృష్ణప్రసాద్, దొంతుల మాణిక్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, ధన్‌రాజ్‌గౌడ్, చందర్, శంకర్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వేణుయాదవ్, రమణ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రిజిస్ట్రేషన్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతా

కొత్తపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గంలో జీఓ నెం.118 ద్వారా ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, అదేవిధంగా రిజిస్ట్రేషన్స్ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ వెల్లడించారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలతో కలిసి శనివారం వీఎం హోమ్ సరూర్‌నగర్, బంగ్లగూడ జీఎస్ఐ - మన్సూరాబాద్ రోడ్‌లో మహవీర్ హరిణవనస్థలిలో వాకర్స్‌తో ముచ్చటించారు. నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వివిధ ప్రాంతాల వాకర్స్ స్థలాల క్రమబద్ధీకరణ, రిజిస్ట్రేషన్లు తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఓటర్స్‌తో కలిసి మధుయాష్కీగౌడ్ నడకలో, యోగా/ వ్యాయామంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, హరిణవనస్థలి అధ్యక్షుడు అనంతుల విక్రమ్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కో - కన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, నాగోల్ డివిజన్ అధ్యక్షుడు మంజులారెడ్డి, కొత్తపేట అధ్యక్షుడు లింగాల కిషోర్‌గౌడ్, నాయకులు రామ్మోహన్‌గౌడ్, బేర బాలకిషన్, గజ్జి భాస్కర్‌యాదవ్, ఎస్వీ కృష్ణప్రసాద్, చిరంజీవి, భవానిశంకర్, కొప్పుల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



వీఎం హోంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

చేవెళ్లలో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే సబితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం పాపడమ్స్ హోటల్లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సబితారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ బలపర్చిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, మాజీ ఎంపీపీ జిల్లెల కృష్ణారెడ్డి, సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షులు మహేందర్‌యాదవ్, అంకిరెడ్డి, కొండల్‌రెడ్డి, మంత్రి రవీందర్‌రావు, సలీం, రుషి, సుశీల పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్బీనగర్: సరూర్‌నగర్ కూరగాయల మార్కెట్ ఎదుట వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. కొత్తపేట రైతుబజార్ ప్రాంతంలో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న వారిని సంబంధిత అధికారులు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తూ, విపరీతంగా చలాన్లు విధిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుక వచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 25, 30 సంవత్సరాలుగా రైతుబజార్ బయటి ప్రాంతంలో వ్యాపారం చేసుకుని జీవించే చిరు వ్యాపారులను సంబంధిత అధికారులు ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలను చలాన్ల పేరుతో భయాందోళనకు గురిచేయడం సహించరానిదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీపీ రాష్ట్ర నాయకుడు సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యలమంచిలి వెంకటగాంధీ కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.సురేష్, ఎబికెఎన్ మూర్తి, శరత్, మోహన్‌రావు, పీవీఎస్ నాయుడు, సంతోష్, అత్తిలి ప్రసాద్, భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. - దిల్‌సుఖ్‌నగర్, ఆంధ్రజ్యోతి

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

వనస్థలిపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి ఆవరణలో అగ్నిమాపక వారోత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజిగిరి డివిజన్ జిల్లా ఫైర్ అధికారి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వేసవిలో తరుచూ అగ్నిప్రమాదాలు జరుగుతాయని, అందుకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారి రంజిత్‌రెడ్డి, వెంకటేశ్, ఎల్బీనగర్, చర్లపల్లి, మల్కాజిగిరి ఫైర్ అధికారులు యాదగిరి, శేఖర్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

పాతబస్తీలో ఒవైసీ బ్రదర్స్ ఆటలు సాగనివ్వను

● హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత



ప్రచారంలో బీజేపీ అభ్యర్థి మాధవీలత, కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి, వీరేందర్‌యాదవ్

సైదాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో ఇప్పటి నుంచి ఒవైసీ బ్రదర్స్ చట్టవ్యతిరేక ఆటలు సాగనివ్వనని బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఐఎస్‌సదన్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మైనార్టీలకు ఒవైసీ చేసిన న్యాయం ఏమిలేదని, కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఈ సారి హైదరాబాద్ కోటను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నేతలు మన్నె శ్రీనివాస్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది అత్యుత్సాహం

వినయ్‌నగర్ విజయ వినాయక ఆలయంలో ఎంపీ అభ్యర్థి మాధవీలత ప్రత్యేక పూజలు నిర్వహించే సమయంలో కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి సెక్యూరిటీ సిబ్బంది నెట్టివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ నాయకులు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మాధవీలత జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

దేశం సురక్షితంగా ఉండాలంటే మోదీ ప్రభుత్వమే ఉండాలి

● మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున



ఎన్నికల ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఈటల జమున, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేశం సురక్షితంగా ఉండాలంటే కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉండాలని మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున అన్నారు. వనస్థలిపురం డివిజన్ శ్రీవెంకటరమణ కాలనీలో నిర్వహించిన సీతారాముల స్వామివార్ల ఒడిబియ్యం వేడుకలకు ఈటల జమున ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. పది ఏళ్లుగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉండటంతోనే ప్రపంచ దేశాలు భారతదేశానికి రెడ్‌కార్పెట్ వేస్తున్నాయన్నారు. దేశ రక్షణకు మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, బడుగు, బలహీనవర్గానికి చెందిన ఈటల రాజేందర్‌ను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో హుజూరాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ ఈటల రాజేందర్‌కు తమ అమూల్యమైన ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు దృష్టిపెట్టాలి

● ఏఆర్‌సీఐ డైరెక్టర్ టాటా నర్సింగరావు



టెక్నికల్ ఫెస్ట్ ముగింపులో అతిథులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ 'టెక్ రీసోనెన్స్ 2కే24' శనివారం ఘనంగా ముగిసింది. ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్. టాటా నర్సింగరావు, బ్రహ్మోస్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్. రాజాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నాలుగేళ్లు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఫెస్ట్‌లో విద్యార్థులు రూపొందించిన డెమోలను పరిశీలించి అభినందించారు. ఏఆర్‌సీఐ సైంటిస్ట్ డాక్టర్. బీవీ శారద, ప్రొఫెసర్ అబ్దుల్ హమీద్, బిట్స్ పిలాని డీన్ బాలసుబ్రహ్మణ్యం, కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, పీఆర్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● రేపు సీతారాముల కల్యాణం, ఎల్లుండి రథోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం 5గంటలకు సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. మంగళవారం రథోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ వేడుకలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరవుతారని తెలిపారు. శివారు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని ఉత్సవ కమిటీ కోరింది.

రెండేళ్ల చిన్నారితో తల్లి అదృశ్యం



అదృశ్యం అయిన తల్లీకూతురు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల చిన్నారితో తల్లి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌కు చెందిన తరుణికి బాచారం గ్రామానికి చెందిన బొడిగె మహేష్‌తో 6 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, రెండేళ్ల కూతురు షాన్వీశ్రీ ఉన్నారు. అయితే ఈ నెల 17న తరుణి భర్తతో గొడవపడి అనాజ్‌పూర్‌కు వెళ్లింది. అదే రోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో తరుణి తన రెండేళ్ల కూతురుని వెంటబెట్టుకుని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో తరుణి తమ్ముడు అభిషేక్ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం పట్టివేత

● మహిళ అరెస్ట్

సైదాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ సైదాబాద్ పోలీసులు సంయుక్తంగా బెల్ట్‌షాప్‌పై దాడి చేసి నిర్వాహకురాలు మహిళతో పాటు రూ.20వేల విలువ గల 67 బాటిళ్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. చింతల్‌బస్తీ(నీలం రాజశేఖర్‌రెడ్డినగర్)లో కె.సునీత అనే మహిళ బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అక్రమ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేపట్టి 67 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



యాదగిరినగర్ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

చంపాపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ యాదగిరినగర్ కాలనీలోని విద్యాబోధిని స్కూల్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని శనివారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కూల్చివేతలు చేపట్టినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు.

జీఎస్ఐటీఐలో 'ఎన్జీడీఆర్, క్రిటికల్ - స్ట్రాటజిక్ మినరల్స్ అన్వేషణ' పై వర్క్‌షాప్

కొత్తపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రేపటి(సోమవారం) నుంచి ఈ నెల 25 వరకు బండ్లగూడలోని భారత భూగర్భ పరిశోధన సంస్థ శిక్షణ సంస్థ(జీఎస్ఐటీఐ)లో 'నేషనల్ జియోసైన్స్ డేటా రిపాజిటరీ(ఎన్జీడీఆర్), క్రిటికల్ - స్ట్రాటజిక్ మినరల్స్ అన్వేషణ' పై వర్క్‌షాప్, శిక్షణ నిర్వహించనున్నట్లు డీడీజీ, జీఎస్ఐ టీఐ మిషన్ - 5 హెడ్ డా. మాథ్యూ జోసెఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్ఐ శిక్షణ సంస్థలోని ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ వర్క్‌షాప్‌లో దేశ ఆర్థిక అభివృద్ధికి, భద్రతకు ఉపకరించే జియోసైన్స్ డేటా, క్రిటికల్ - స్ట్రాటజిక్ మినరల్స్ అన్వేషణలపై నిపుణులు విపులీకరిస్తారన్నారు. దేశం ఆత్మ నిర్భర్ భారత్‌గా రూపుదిద్దుకోవడంలో క్రిటికల్ - స్ట్రాటజిక్ మినరల్స్ అన్వేషణ విశిష్టమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం

● ఎల్బీనగర్ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ గుర్రం శ్రీనివాస్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం ఎల్బీనగర్ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ గుర్రం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థిని గెలపిస్తేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. పేదలను గుర్తించే కాంగ్రెస్ ప్రభుత్వానికే ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హామీల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణనాయక్, శ్రీనివాస్ నాయక్, సంతోష్, వెంకటేశ్, రవి, విజయ్, గణపతి, పవన్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

● కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

చంపాపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతోనే దేవాలయం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం కోసం శనివారం భక్తులు కిషోర్, రవీందర్ లక్ష రూపాయల విరాళం చెక్కును ఆలయ చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వారిని ఘనంగా సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ముద్ద కళ్యాణ్ చక్రవర్తి, అంజిరెడ్డి, మేక సురేందర్‌రెడ్డి, చీర తిరుమలేష్, అర్చకులు అంబప్రసాద్, పీతాంబరాచార్యులు పాల్గొన్నారు.

నేడు మటన్‌షాప్‌లు బంద్

● ఉత్తర్వులు జారీచేసిన జీహెచ్ఎంసీ కమిషనర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతి సందర్భంగా గ్రేటర్‌లో ఆదివారం మటన్, చికెన్, ఫిష్, బీఫ్ షాప్‌లు మూసివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. జీహెచ్ఎంసీ ఆదేశాలు, నిబంధనలు దుకాణ నిర్వాహకులు పాటించాలన్నారు.

నేడు కూడా సీఎస్‌సీ సెంటర్లు ఓపెన్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రాపర్టీ ట్యాక్స్‌పై 5 శాతం రిబెటుతో చెల్లించే వెసులుబాటు ఇంకా 10 రోజులు మాత్రమే ఉన్నందున ఆదివారం కూడా జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, సర్కిళ్లలోని సిటిజన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) తెరిచే ఉంటాయని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సెంటర్లు అందుబాటులో ఉంటాయని, ఇప్పటి వరకు 5శాతం రిబెట్ పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా, ఇప్పటి వరకు 4.50 లక్షల మంది రూ.3.70 కోట్లు చెల్లించారని, గతేడాది ఎర్లీ బర్డ్‌లో రికార్డుస్థాయిలో రూ.760 కోట్ల ఆస్తి పన్ను ఆదాయం వచ్చిందని కమిషనర్ తెలిపారు.

నేటి యూపీఎస్సీ పరీక్షకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ఆదివారం జరిగే యూపీఎస్సీ పరీక్షలు-2024కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్స్ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని, బస్టాపుల్లో ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బస్‌స్టేషన్లలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయడంతో పాటు కోఠి-9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్- 9959226154 కమ్యూనికేషన్ సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

బస్ ట్రిప్పులు యథాతథం

గ్రేటర్‌లో ఎండలు తగ్గడంతో ఆర్టీసీ బస్ ట్రిప్పులు యథాతథంగా నడుపుతున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండల నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ట్రిప్పుల సంఖ్య తగ్గించాలనుకున్నా.. వాతావరణం చల్లబడటంతో ట్రిప్పులను యథాతథంగా నడుపుతున్నట్లు పేర్కొన్నారు. గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 2,839 బస్సులతో రోజూ 30వేల బస్ ట్రిప్పులతో 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తుందన్నారు.